
ఆశల సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు

- గత ఏడాది నష్టపోయిన అన్నదాతలు
- దుక్కులు దున్ని ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్న రైతన్నలు
- ఆదుకోని కూటమి ప్రభుత్వం.. అందని పెట్టుబడి సాయం


పొలం దున్నుతున్న రైతులు

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే పలకరించాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వర్షాలు కురుస్తుండటంతో ఈ ఏడాదైనా పంటలు పండగపోతాయా అన్న ఆశతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. సేంద్రియ ఎరువులు జల్లి, దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. భారీగా పెరిగిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు, కూలీ ఖర్చులు దడ పుట్టిస్తున్నా నేల తల్లినే నమ్ముకున్న రైతన్నలు మాత్రం వ్యవసాయానికి సిద్ధమవుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడం లేదు. ఎప్పటిలాగే భూ మాతను నమ్ముకుని ఆశల సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

అచ్చంపేట: ఈ ఏడాది ముందస్తు వర్షాలు రైతన్నకు ఊరట కలిగిస్తున్నాయి. మే నెల చివరిలో వర్షాలు పడి, మళ్లీ ఒక వారం పాటు ఎండలు మండిపోయినా తిరిగి వాతావరణం చల్లబడటం, రాబోయే వారం రోజులపాటు వర్ష సూచనలు రావడంతో రైతన్నలు సాగుకు సమాయత్తమవుతున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో సుమారు 30 వేల హెక్టార్లలో పంటలు సాగు చేస్తారు. ముఖ్యంగా పత్తి, మిర్చి, పొగాకు, పసుపు, మినుము, కంది, మొక్కజొన్న వంటివి పండిస్తారు. తొలుత పత్తి పంట వేసేందుకు రైతులు దుక్కులు దున్ని పత్తి విత్తనాలు విత్తుతున్నారు.

సేవలు నిర్వీర్యం

సీజన్ ప్రారంభమై రైతులు వ్యవసాయానికి సమాయత్తమయినా కూటమి ప్రభుత్వం నుంచి రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందే పరిస్థితులు కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రైతులకు అందాల్సిన సేవలు నిర్వీర్యం అయ్యాయి. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఇస్తామన్న రూ.20 వేలు గత ఏడాది ఇవ్వలేదు. ఈ ఏడాది కూడా ఇస్తారన్న గ్యారంటీ లేదు. ఇదిగో ఇస్తాం... అదిగో ఇస్తాం... అంటూ కాలయాపన చేస్తున్నారు. ఎలాగోలా పంటలు పండించినా మద్దతు ధర ఉంటుందన్న భరోసా లేదు. గత ప్రభుత్వంలో అమలైన పథకాలు భారీగా కోతకు గురవుతున్నాయి. రైతు భరోసా కేంద్రాలు నిర్వీర్యమయ్యాయి. కియోస్క్ మిషన్లు మూలన పడ్డాయి.

నష్టాల ఊబిలో అన్నదాతలు

గత ఏడాది రైతులు పూర్తిగా నష్టాల ఊబిలో కూరుకుపోయారు. కనీసం పెట్టుబడులు కూడా రాక తల్లడిల్లిపోయారు. వ్యవసాయ సీజన్ ప్రారంభంలో అధిక వర్షాలకు పత్తి పంట పూర్తిగా దెబ్బతినగా, మిర్చి సీజన్‌లో వర్షాలు లేక తెగుళ్ల బారిన పడి దిగుబడి బాగా కోల్పోయారు. 2023–24లో క్వింటా మిర్చి రూ.22,000 నుంచి రూ.25,000 వరకు ఉంటే గత ఏడాది రూ.10 వేలకు మించి లేదు. 30 క్వింటాళ్లకు పైగా వచ్చే మిర్చి దిగుబడి గత ఏడాది 10 నుంచి 12 క్వింటాళ్లకు పడిపోయింది. కనీసం కూలీ ఖర్చులు కూడా రాని పరిస్థితులు ఏర్పడ్డాయి.

- వరి పంటలోను అన్నదాతల ఆశలు ఆవిరయ్యాయి. వర్షాభావ పరిస్థితులు, అకాల వర్షాలు, పెరిగిన ఖర్చులతో మినుము, మొక్కజొన్న, వరి, పొగాకు, పసుపు, కంది పంటలు రైతులను కోలుకోలేని విధంగా దెబ్బతీశాయి. కూటమి ప్రభుత్వం మేలు చేస్తుందని అనుకుంటే నిలువునా ముంచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది పంటలకు గిట్టుబాటు, పెట్టుబడి సాయం, సబ్సిడీ విత్తనాలు, పంట నష్టం, ఎరువుల పంపిణీలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని రైతులు చెబుతున్నారు.

అండగా నిలిచిన గత ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. ఖరీఫ్ సీజన్‌కు ముందే ప్రతి రైతు ఖాతాలో వైఎస్సార్ రైతు భరోసా నగదు జమ అయ్యేది. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు పంపిణీ చేసేవారు.. పంటలో ఏదైనా నష్టం వాటిల్లితే ఇన్‌పుట్ సబ్సిడీ కింద పరిహారం అందించేవారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రాయితీపై ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలు అందించి తోడ్పాటును అందించేవారు. చంద్రబాబు వ్యవసాయం దండగ అంటే, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయాన్ని పండుగలా మార్చారు. ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా పెట్టుబడి సాయం ఇస్తామని ఆశ చూపి కాలయపన చేస్తోంది. పండించిన పంటలకు మద్దతు ధరలు లేవు. కనీసం విత్తనాలు కూడా అందుబాటులో ఉంచిన పరిస్థితి లేదు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



గత ఏడాది పంటలు మొత్తం కోల్పోయాం. మాకు వ్యవసాయం తప్ప ఏమీ తెలియదు. నష్టం వచ్చినా, లాభం వచ్చినా వ్యవసాయాన్నే నమ్ముకున్నాం. గత ఏడాది వచ్చిన నష్టం ఎప్పుడూ రాలేదు. ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేస్తే విత్తనాలైనా కొనుగోలు చేసుకుంటాం. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– పల్లప్రోలు వెంకటరెడ్డి, రైతు, కోగంటివారిపాలెం

ప్రభుత్వం చేయూతనివ్వాలి



ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ రూ.20 వేలు ఇస్తే విత్తనాలు కొనుక్కుంటాం. ఇప్పుడు వర్షాలు పడుతున్నాయి కాబట్టి పత్తి విత్తనాలు వేయడానికి ఇదే అదును. వ్యవసాయాన్ని నమ్ముకున్న మాకు ప్రభుత్వం చేయూతనిస్తే కొంత వరకైనా ఉపయోగం ఉంటుంది. ముఖ్యంగా సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సప్లై చేయాలి.

– రేపల్లె చిన్నోడు, రైతు, రుద్రవరం

పచ్చ మూకల కుటిల చర్యలకు భయపడేది లేదు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి


మాట్లాడుతున్న డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి

ముప్పాళ్ళ: పచ్చ మూకల కుటిల చర్యలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భయపడరని, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్ రెడ్డి చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామం సాయిబాబా గుడి ఆవరణలో వైఎస్సార్ సీపీ మండల స్థాయి ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో సుధీర్‌భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందన్నారు. దీనికి పొదిలిలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పర్యటనలో టీడీపీ శ్రేణులు చేసిన దాడులే నిదర్శనమన్నారు. ఇలాంటి దుర్మార్గాలకు భయపడేదే లేదని, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని చెప్పారు. రెంటపాళ్ళలో టీడీపీ నాయకుల అరాచకాలకు మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కొర్లకుంట శివనాగమల్లేశ్వరరావు విగ్రహాన్ని ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. సమావేశంలో ముందుగా కొర్లకుంట శివనాగమల్లేశ్వరరావుకు నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు ఇందూరి నరసింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఎంజేఎం రామలింగారెడ్డి, మాజీ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

త్వరితగతిన సేవలు అందించడమే ధ్యేయంగా పనిచేయాలి

తహసీల్దార్ అశ్రపున్నీసా బేగం


తహసీల్దారుకు వీడ్కోలు కార్యక్రమంలో సిబ్బంది

బెల్లంకొండ: రెవెన్యూ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు త్వరితగతిన సేవలు అందించడమే ధ్యేయంగా సిబ్బంది పనిచేయాలని తహసీల్దార్ అశ్రపున్నీసా బేగం తెలిపారు. తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆమె మంగళగిరి సీసీఎల్ఏకు శుక్రవారం బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది శుక్రవారం తహసీల్దార్‌కు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాది కాలంలో అన్ని గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసినట్లు పేర్కొన్నారు. తనకు సహకరించిన రెవెన్యూ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యాలయ సిబ్బంది తహసీల్దార్‌ను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల విక్రయంపై చర్యలు తీసుకోవాలి


ప్రైవేట్ పాఠశాలల వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సత్తెనపల్లి: ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల విక్రయంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కోటా సాయికుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని నారాయణ, భాష్యం స్కూల్ బుక్ స్టోర్ ముందు ఎస్ఎఫ్ఐ, విద్యార్థులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ నారాయణ, భాష్యం పాఠశాలల్లో పుస్తకాలు విక్రయిస్తున్నా విద్యా శాఖ అధికారులు పట్టించుకోవటం లేదని, తాము అక్కడ ఉండి ఫోన్ చేసినా గంటల తరబడి బుక్ స్టాల్ ముందు వేచి ఉన్నా స్కూల్స్ వద్దకు రావటం లేదన్నారు. వచ్చినా వాళ్లతో మాట్లాడుతూ కాలయాపన చేస్తున్నారని, సత్తెనపల్లిలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యా శాఖ అధికారులతో కుమ్మక్కై పుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అమూల్య మాట్లాడుతూ ఇది ఎప్పటి నుంచో జరుగుతుందని అంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా జిల్లా విద్యా శాఖ అధికారులు స్పందించి ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల తల్లిదండ్రులపై జరుగుతున్న దోపిడీని అరికట్టాలన్నారు. గతంలో పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా చర్యలు తీసుకోకుండా మరలా వినతి పత్రాలు ఇవ్వమని కోరుతున్నారన్నారు. విద్యా శాఖాధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే ఎంఈఓ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని, బంద్‌కు పిలుపు నిస్తామని హెచ్చరించారు. ముందుగా అధికారులను సస్పెండ్ చేయాలని, డౌన్ డౌన్ విద్యా శాఖాధికారులు అంటూ నినదించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు ఉన్నారు.

రక్తపోటు వలన కలిగే అనర్థాలపై అవగాహన


మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

రాజుపాలెం: యుక్త వయసులో గర్భధారణ, అధిక రక్తపోటు వలన ప్రమాదాలు ఎక్కువగా ఉంటాయని, దీనిపై ఆరోగ్య సిబ్బంది దృష్టి సారించాలని పల్నాడు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ రవి అన్నారు. మండలంలోని పెదనెమలిపురిలో యుక్త వయసులో గర్భం వస్తే కలిగే అనర్థాల గురించి అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మాట్లాడుతూ తల్లికి రక్తపోటు సమయంలో శిశువు అకాల జననం, తక్కువ బరువుతో పుట్టడం వంటివి జరుగుతాయన్నారు. రక్తపోటు వలన మూత్ర పిండాలకు కూడా హాని కలగవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ వైద్యాధికారి పద్మావతి, పీహెచ్‌సీ వైద్యాధికారి రవితేజనాయక్, డీపీఎంవో ఒన్నూరు బాషా, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్ రావు, అంగన్‌వాడీ పర్యవేక్షకులు ప్రసన్న, ఆశా, నోడల్ అధికారి ఉషారాణి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధపడాలి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామకృష్ణ


అచ్చంపేటలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ సభ్యులు

అచ్చంపేట: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధపడాలని పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ, పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావులు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన అచ్చంపేటలో నిర్వహించిన సీపీఐ మహాసభలో వారు మాట్లాడారు. సభకు మండల కార్యదర్శి సంపంగి ఏడుకొండలు అధ్యక్షత వహించారు. ప్రజాకంటక పాలన కొనసాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను సభ్య సమాజం ముక్త కంఠంతో ఖండించాలన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజా హక్కులకై సీపీఐ నిర్వహించే పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎర్రజెండాలు చేతబట్టి ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని నినాదాలు చేస్తూ అచ్చంపేటలో ప్రదర్శన నిర్వహించారు. మండల సీపీఐ కార్యదర్శిగా షేక్ ఖాదర్‌మస్తాన్, కమిటీ సభ్యులుగా షేక్ మహమ్మద్‌రియాజ్, సంపంగి ఏడుకొండలు, బి.శ్రీనివాసరావు, తాళ్లూరు మోహనరావు, మధు, నిడుముక్కల సుభాని, షేక్ మౌలాలి తదితరులు ఎంపికయ్యారు.

దళిత మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిని శిక్షించాలి

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజరపు శివనాగేశ్వరరావు

సత్తెనపల్లి: దళిత మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజవరపు శివనాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సత్తెనపల్లిలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్యసాయిజిల్లా రామగిరి మండలం పెరూరు పంచాయతీ పరిధిలోని ఎడుగుర్రాలపల్లె గ్రామానికి చెందిన దళిత మైనరు బాలికపై గత 6 నెలలుగా 14 మంది టీడీపీకి చెందిన వారు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డ విషయం విదితమేనన్నారు. బాధిత దళిత కుంటుంబానికి అండగా ఉండవలసిన టీడీపీ నాయకులు వారికి తీరని అన్యాయం చేశారన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేను బాధిత మహిళ కుటుంబాన్ని పరామర్శించనివ్వకుండా అడ్డుకోవడం అన్యాయమన్నారు. బాధిత బాలిక, ఆమె తల్లి బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారన్నారు. ఇదే నియోకవర్గంలో గత మూడు నెలల వ్యవధిలో మూడు హత్యలు జరగడం గమనార్హమన్నారు. దళిత మైనర్ బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలని ఆమెపై అత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని, ఆ కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠా అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంతురావు

సత్తెనపల్లి: ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పట్టణంలోని తన కార్యాలయంలో సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు దొంగల ముఠా వివరాలను వెల్లడించారు. సంతమాగులూరు మండలం మిన్నేకల్లు గ్రామానికి చెందిన కుంభ కోటయ్య, బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెంకు చెందిన కొజ్జా కోటయ్య, సంతమాగులూరు మండలం మిన్నేకల్లుకు చెందిన తిరువీధుల అనంతరాములు గత కొంతకాలంగా దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి విలాసాలకు నగదు అవసరమై, తక్కువ సమయంలో కష్టపడకుండా ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. కొజ్జా కోటయ్యకు గతంలో దొంగతనం చేసిన అనుభవం ఉండడంతో ముగ్గురు కలిసి దొంగతనం చేయడానికి అనువుగా ఉన్న ఇల్లు కోసం రెక్కీ చేస్తుండగా బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెం శివారులో నందిరాజుపాలెం రోడ్‌లో నాగిరెడ్డిపాలెం గ్రామస్తుడు యర్లబద్దూరి చిన్న వెంకటరమణారెడ్డి ఇంటిలో ఈ నెల 1న దొంగతనం చేసి రూ.4.50 లక్షల విలువ గల 143 గ్రాముల బంగారు, 15 తులాల వెండి వస్తువులు, రూ.15 వేలు నగదు అపహరించారన్నారు. దీనిపై పెదకూరపాడు సీఐ పి.సురేష్ నేతృత్వంలో బెల్లంకొండ ఎస్ఐ డి.ప్రవీణ్ కేసు నమోదు చేసి, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ద్వారా ఆధారాలు సేకరించి, సాంకేతిక పరిజ్ఞానంతో కుంభా కోటయ్యను గుర్తించి అతని ద్వారా మిగిలిన ఇరువురిని గుర్తించి శుక్రవారం నిందితులను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారన్నారు. వారి నుంచి 118.16 గ్రాములు రికవరీ చేశామన్నారు. కుంభా కోటయ్య నుంచి దొంగతనం సమయంలో వాడిన స్క్రూ డ్రైవర్ సీజ్ చేశామన్నారు. కేసు దర్యాప్తును త్వరగా పూర్తి చేసి నిందితుల నుంచి దొంగిలించిన సొత్తును రికవరీ చేసిన సీఐ సురేష్, ఎస్ఐ ప్రవీణ్, హెడ్‌కానిస్టేబుళ్లు షణ్ముఖరావు, చాంద్‌బాషా, కానిస్టేబుళ్లు మల్లిఖార్జునరావు, పార్థసారథి, శివకృష్ణ, శ్రీనివాసరావులను జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా శాఖాధికారుల తనిఖీలు



సత్తెనపల్లి: పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల్లో విద్యా శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల విక్రయాలు జరుగుతున్నప్పటికీ విద్యా శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలల ఎదుట ఆందోళనలు నిర్వహించారు. ఈ క్రమంలో విద్యా శాఖ అధికారులు స్పందించారు. సత్తెనపల్లి మండల విద్యాశాఖ అధికారి–1 ఏ శ్రీనివాసరావు పట్టణంలోని నారాయణ, భవిష్య పాఠశాలల్లో తనిఖీలు చేపట్టి పుస్తకాలు, స్టేషనరీ విక్రయాలను పరిశీలించి నోటీసులు జారీ చేశారు.

క్లుప్తంగా

జాబ్ మేళాలో 56 మంది ఉద్యోగాలకు ఎంపిక



సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 56 మంది నిరుద్యోగులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో జాబ్ మేళాలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. దీనిలో భాగంగా సత్తెనపల్లిలో నిర్వహించిన జాబ్ డ్రైవ్‌కు 10 కంపెనీలు హాజరు కాగా 170 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వారిలో 56 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మ మాట్లాడుతూ ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సత్తెనపల్లిలో జాబ్ మేళాను నిర్వహించడం సంతోషకరమన్నారు. నియామక పత్రాలు అందుకున్న యువతకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజిరావు, పల్నాడు జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.రవీంద్రనాయక్, సత్తెనపల్లి స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ ఇందూరి రామకృష్ణ రెడ్డి, రామాంజినేయులు, వీరాంజినేయులు, అంజిరెడ్డి, సురేష్, శ్రీకాంత్, రమ్యా, కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మండల వ్యవసాయాధికారిగా శ్రీధర్‌రెడ్డి



ముప్పాళ్ళ: మండల వ్యవసాయ శాఖాధికారిగా ఎస్.శ్రీధర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా సత్తెనపల్లి మండల వ్యవసాయాధికారిగా పనిచేస్తూ ముప్పాళ్ళకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏవోగా విధులు నిర్వహిస్తున్న ఎం.అరుణ జిల్లా ట్రైనింగ్ సెంటర్ ఏవోగా బదిలీ అయ్యారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు



దారా బుల్లెమ్మాయి

అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురం ఎస్సీ కాలనీకి చెందిన దారా బుల్లెమ్మాయి కనబడకుండా పోయిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం సుమారు 30 ఏళ్ళ వయస్సు కలిగిన దారా బుల్లెమ్మాయి, 11 ఏళ్ళ వయస్సు కలిగిన దారా అరవింద ఇద్దరు ఈ నెల 7వ తేదీన కనబడకుండా పోవటంతో కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోవడంతో ఈ నెల 12వ తేదీన అమరావతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ అచ్చియ్య అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు రోజులపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అచ్చంపేట: నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా మండలంలో రెండు రోజులపాటు శని, ఆదివారాలలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శివకోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. ఊటుకూరు నుంచి నూతనంగా 33/11 కేవీ లైను లాగుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం అనివార్యమైందన్నారు. విద్యుత్ వినియోగదారులు, విద్యుత్ ఆధారిత వ్యాపారులు గమనించి సహకరించవలసినదిగా ఆయన కోరారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



అచ్చంపేట: మండల మాదిపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ మా తంగి కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వంసకాలంలో పుస్తకాలు పంపినట్లు చెప్పారు. మాజీ సర్పంచ్ వల్లభనేని వెంకటేశ్వరరావు, రంజాన్, సీతారామయ్య, కుమారి, కనకయ్య, మౌలాలి, సుబ్బారావు, నరసింహారావు, నాగరాజు రమేష్ పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'గ్రాడ్యుయేషన్ డే'



బెల్లంకొండ: మండలంలోని మాచాయపాలెం సెక్టార్ పరిధిలోని పాపాయిపాలెం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తిచేసిన, ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రాథమిక పాఠశాలలకు పంపుతున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాలలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం నేడు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ కోటా పెదమస్తాన్ శుక్రవారం తెలిపారు. ఈ అంతరాయాన్ని విద్యుత్ వినియోగదారులు, రైతు సోదరులు గమనించాలని ఆయన కోరారు.

అమరావతి: మండల పరిధిలోని పలు గ్రామాలకు రెండవ శనివారం కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ శాఖ ఏఈ పి.రవికిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు మల్లాది, అమరావతి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బెల్లంకొండ: మండలంలోని పాపాయపాలెం, బెల్లంకొండ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని బెల్లంకొండ ఏఈ పవన్ కుమార్ తెలిపారు. 33/11 కేవీ లైన్లకు మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు మండలంలోని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

దొడ్లేరు గ్రంథాలయం పంచాయతీ పరిధిలో లేదు



దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో ఉన్న పుస్తక పఠన కేంద్రం (మినీ గ్రంథాలయం) పంచాయతీ పరిధిలో లేదని, కాబట్టి తమకు సంబంధం లేదని పంచాయతీ విస్తరణాధికారి జి.శ్రీనివాసరావు రాత పూర్వకంగా సమాధానం శుక్రవారం ఇచ్చినట్లు అర్జీదారుడు పోసిపోగు సుకుమార్ తెలిపారు. ఈ నెల 9వ తేదీన తాను పుస్తక పఠన కేంద్రాన్ని తెరిపించాలని పీజీఆర్ఎస్‌లో అర్జీ ఇవ్వగా దానికి సమాధానంగా పంచాయతీకి సంబంధం లేదని ఇచ్చినట్లు చెప్పారు. దీనిపై అర్జీదారుడు మాట్లాడుతూ పుస్తక పఠన కేంద్రం తెరిపించాలని తిరిగి జిల్లా గ్రంథాలయ శాఖ అధికారులకు అర్జీ పెట్టనున్నట్లు తెలిపారు.

పాడి రైతులకు సంగం పశుగ్రాసాభివృద్ధి పథకం

పెదకూరపాడు: సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు పాడి పరిశ్రమ అభివృద్ధికి సంగం డెయిరీ పశు గ్రాస క్షేత్రాలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహక నగదు అందిస్తుందని డెయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు, ఉంగుటూరు బీఎంసీ మేనేజర్ ఆనంద్ తెలిపారు. శుక్రవారం 75త్యాళ్ళూరులో రైతులకు పథకంపై అవగాహన కల్పించారు. కనీసం 25 నుంచి 50 సెంట్లు పశు గ్రాసం సాగు చేసే రైతులకు రూ.7,500, 50 నుంచి 75 సెంట్లు సాగుకు రూ.9 వేలు, 75 సెంట్ల నుంచి 1 ఎకరా అంతకంటే ఎక్కువ పశు గ్రాస క్షేత్రాలకు రూ.12 వేలు ప్రోత్సాహక నగదు అందిస్తున్నట్లు వెల్లడించారు. గడిచిన సంవత్సర కాలంలో సంగం డెయిరీకి పాలు పోసిన రైతులకు, కో 4, కో 5, సూపర్ నేపియర్ పశు గ్రాస రకాలు కొత్తగా సాగు చేసే రైతులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. నాటిన 65 రోజుల తరువాత పశుగ్రాస క్షేత్రం వద్ద రైతులకు ప్రోత్సాహకాన్ని చెక్కు రూపంలో అందిస్తామని చెప్పారు. డెయిరీ ఇచ్చే ప్రదర్శన బోర్డును క్షేత్రం వద్ద ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాజిబాబు, అజయ్ కుమార్ రెడ్డి, గోపాలరావు, రైతులు పాల్గొన్నారు.